# ఉద్యోగస్తుని ఊహాలు

బి. రా మ నా థ శా స్త్రి

వెంకట్రావ్ యీజీ చైర్‌లో పడుకుని ఆలో చిస్తున్నాడు. చేతిలో పచ్చకాగితం గాలికి రెపరెపలాడుతోంది ...సగర్వంగా ఆ కాగితాన్ని పరికించి చూశాడు వెంకట్రావ్...అశోక స్తూపం పైన ధర్మచక్రం పచ్చపచ్చగా ప్రకాశిస్తోంది!.... 'రుపీస్ వన్ హండ్రెడ్' అని పెద్దపెద్ద అక్ష రాలు—'నూఱు రూపాయలు' అని తెలుగులో అరవంలో, హిందీలో తర్జుమా!.... అవన్నీ అతడికేసి చూసి నవ్వుతూన్నయ్! పావుటా వంతైనాలేని ఆ చిన్న కాగితం ముక్క విలువ నూఱు రూపాయలా!

వెంకట్రావ్ ఆలోచిస్తున్నాడు. ఒకప్పుడు తనకు కాఫీకి బేడా కావాల్సివచ్చినా యింకొకర్ని 'దేహి' అనాల్సి వచ్చేది.. ఇప్పుడు! తనే యిం కొకరికి యివ్వగలడు!

గడచిన రోజుల్ని తలచుకుంటూంటే వెంక ట్రావుకి ఆశ్చర్యం- ఆనందం ఒకేసారి కలుగు తూన్నయ్,

ఆ రోజుల్లో తను ఉద్యోగంకోసం పడిన పాట్లన్నీ సినీమాలాగ వెంకట్రావ్ కళ్ళముందు కనిపిస్తూన్నయ్.. కాఫీకూడా చేతిలోలేని ఆ రోజుల్లో తనెలా కాలం గడిపేవాడో అత డింకా మఱచిపోలేదు। అదృష్టవశాత్తు యిప్పు డొక ఉద్యోగం అనేది దొరికింది. మంచిరోజులు వచ్చాయని వెంకట్రావ్ అనుకుంటున్నాడు .... గడిచిపోయిన రోజుల్ని - అప్పటి అనుభవాలనూ నెమరు వేసుకుంటున్నాడు వెంకట్రావ్.....

బజార్లోకి వెళ్ళాలంటేనే భయంగావుండేది। కనపడ్డ ప్రతివెధవా అదే ప్రశ్న!...తన సంగతి వాళ్ళకు దేని?....పోనీ- అవసరం వచ్చినప్పు డేమైనా ఆదుకుంటారా అంటే అదీ అగుపడదు! ఇబ్బందిగావుందని కాఫీ అడిగినా యిచ్చే వెధవ ఒక్కడూలేడు! ... అందరూ సలహా లిచ్చేవాళ్లే ప్రేమ ఉట్టిపడుతున్న ట్టనిపించేవాళ్ళే!.... పట్టి మోసం!... మాటల్తో టోల్తా కొట్టద్దామని!....

బజార్లో కనబడితేసరి—యిహ ప్రారంభి స్తారు, "ఏరా! యేంజేస్తున్నవ్?" ఏమిటిప్రశ్న! కనపట్టంలా?

"ఏమోయ్ పాసైనావా? ఆ యేమిటితర్వాత?" —యిదొకరకం!

"ఏవండి యిప్పుడు మీరేంజేస్తున్నట్టు?"— యిదో ధోరణి!

"హల్లో! వాట్ డూయూ ప్రపోజ్ టుడూ నెక్స్ట్?"—యిది తెలుస్తూనే వుందిగా!

వీళ్లందరికీ ఒకటే సమాధానం।—"నథింగ్" "ఏమీలేదండి।"

దీంతో వదలరు కొంతమంది।

"యమ్మే చదవరూ?" అనీ, "బీయల్ కెళ్తా రని విన్నానే" అనీ, "బి. యిడి. చదవండి శుభ్రంగా" అనీ! సలహాలు! "స్టడీస్ కంటెన్యూ చేయరూ?" అనీ, "ఎక్కడైనా సెంట్రల్లో ట్రయ్ చేయరాదూ?" అనీ, "నైజాంవెళ్తే భలే ఛాన్సురా!" అనీ ప్రారంభిస్తారు! వాళ్లకి తన స్థితిని విడమర్చి బోధచేసేటప్పటికి తాతలు దిగి వచ్చేవారు।

ఇప్పుడైతే రకీమని చెప్పేస్తాడు—తనఉద్యో గం, జీతం వగైరాలన్నీ అడక్కుండానే చెప్పే స్తాడు! ఇహవాళ్లేమంటారు? 'కంగ్రాట్యులేషన్స్' అనేగా? లేకపోతే 'టీపార్టీ యేదోయ్' అనేటట్టు

యితే వాళ్ళమొహాన కాస్త కాఫీ పోయిస్తేసరి! కుక్కల్లా తన వెంటతిరుగుతారు!

ఉద్యోగంలోచేరి యింకా రెణ్ణెల్లయినా కాలేదు. అప్పుడే తనకింత గర్వం యెలావచ్చిందో అని వెంకట్రావ్ ఆశ్చర్యపడ్డాడు! అన్నీ డబ్బుతోనే వస్తయ్!

వెంకట్రావ్ ఆలోచనమళ్లీ 'గతదినాల' వైపు మళ్లింది.

మొన్న మొన్నటిదాకా ప్రతిదానికీ అమ్మనూ అయ్యను అడగాల్సి వచ్చేది. సినిమాకు వెళ్లాలంటే—తలకాయ గోక్కుంటూ "అమ్మా తొమ్మిదణాలుంటే యియ్యవే సినిమాకువెళ్తా" అని అభిమానాన్ని చంపుకుని అడిగినా, "ఎందుకురా యిప్పుడు తొమ్మిదణాలుపెట్టి అనవసరంగా?" అని మందలింపు. దానికితను—"కాదే—మా స్నేహితులందరూ వెళ్తున్నారు విశ్వనాధంకూడా వెళ్తున్నాడు—నేనూ వెళ్లాలి" అని బ్రతిమాలాలి. అయినా లాభంవుండేదికాదు!

ఒకరోజున—తన ఫ్రెండ్స్ కొందరొచ్చారు యింటికి—ఎప్పుడూ రానివాళ్లూ—మర్యాదస్తులూ కొంతసేపు బాతఖానీ అయింతర్వాత వాళ్లకు కాఫీ అయినా—ఫలహారం లేకపోయినా యివ్వండే బాగుంటుందీ! తనింట్లో అసలు కాఫీ పెట్టరు ఎవరికీ తాగే అలవాటు లేదు—తనక్కూడా. అయినా యింటికి వచ్చిన అతిథులకైనా యివ్వాలా? తనదగ్గిఱ దమ్మిడీలేదు. అమ నద గాలి! 'ఇప్పుడే వస్తా'నని వాళ్లతోచెప్పి వంటింట్లోకి వెళ్లాడు. ఏమని అడగాలి? ఎట్టా అడగాలి? చాలసేపు తటపటాయించి—చివరకూ యెట్టాగో "ఒక రూపాయ్ వుంటే యియ్యవే' అన్నాడు? ఆమె ఒక్కసారి అనవంక యెగా దిగా చూసి "ఎందుకు" అన్నది. చెప్పాడు. "నాదగ్గిఱెక్కడిది? మీ నాన్నను రానీ!'' అని అంతటితో ఊరుకోకుండా ఉపన్యాసం ప్రారంభించింది. నిజం తనకు తెలుసు. పెట్టెలో డబ్బుందని తెలుసు-తాళాలావిడదగ్గతే ఉన్నాయనీ తెలుసు! ఇహ యేంమాట్టాడ్తాడు? తలవంచుకుని వచ్చేశాడు! 'ఎందుకడిగానురా' అని యెంత బాధపడ్డాడు! ఛీ! చిన్న చిన్న వాటిక్కూడా—దమ్మిడీ కావల్సినా ఒకర్ని అడగాల్సి వచ్చిందిగదా అనియెంత కుమిలిపోయాడో! బ్రతకడం దేనికి—చేతగానప్పుడు?

ఇలాంటి సందర్భాలెన్నో! లక్షలు! వెంకట్రావింకా ఆలోచిస్తున్నాడు. టేబుల్‌మీద గడియారం టిక్, టక్కులతో అతడి ఆలోచనల్ని అరికట్టి అతడి ధ్యాస తనమీద పడాలని చేసే ప్రయత్నాలిన్నీ విఫలమవుతున్నాయ్ అతగాడింకా ఆలోచిస్తూనే వున్నాడు చేతిలోని పచ్చకాగితం చేసే అల్లరిని కూడా లెక్కచేయకుండా.

ఆరోజుల్లో అంతే! జీవితంమీద విరక్తికల్గిన సమయాలనేకం. అమ్మకీ నాన్నకీ తన మీద ప్రేమలేదనలేం అది సహజంగా ఉంటుంది. కాని యిరవై యేళ్లువచ్చి, బి ఏ, చదివే వ్యక్తి యొక్క అవసరాలనూ అభిప్రాయాలనూ గుర్తించే శక్తి వాళ్లకు లేకపోవడం తన దురదృష్టం. బాధ్యత అంటే తనకూ తెలుసు, రోజులెలా ఉన్నాయో—సంసారం గడవడం యెంత కష్టమో గ్రహించకపోలేదు. అయితే అలాగని అన్నీ మానుకున్నారా? ఇంటికయ్యే ఖర్చు ముందు తనదెంత? దానిలో యెన్నోవంతు? అదీగాక తనకేమయినా దురభ్యాసాలుంటే అనుకోవచ్చు; సిగరెట్లా, బీడీలా? వాటిపొగ అంటేనే గిట్టదే తనకి? కాఫీ అయినా యెప్పుడో తప్ప, రోజూ తాగాలనిలేదే?

సినిమాలకు వెళ్తూంటాడు; నిజం తన ఆనందం కోసం సినిమాలకు తఱచూ వెళ్లేవాడే. వాటిల్లో చూచి నేర్చుకోవాల్సిన దేమైనా ఉందా అనే మాటలావుంచి—వాటిల్లోని సంగీతానికీ పాటలకూ ముగ్ధుడైపోయి పదే పదే చూడాలనుకునేవాడు. 'సాంగ్స్, మ్యూజిక్' కోసం సిని

మాలకొచ్చేవారిలో తనూ ఒకడు. అందుకనే యెక్కువగా హిందీ పిక్చర్లకెళ్తూంటాడు.

ఏది యెలావున్నా మంచి పాటలూ, మంచి మ్యూజిక్కూ ఉంటే చాలుననేవాడు పాటలకోసమే ఒక్కొక్క పిక్చర్ని డజన్ సార్లకి తక్కువ లేకుండా చూసిన సమయాలనేకం. రతన్, అన్మోల్‌ఘడీ, షహనాయ్, కాజల్, ప్యార్ కీజీత్, పతంగా, శబ్నం, దులారీ, దిల్లగీ వగైరా పిక్చర్ల లిస్టంతా వెంకట్రావ్ మెదడులో గిర్రున తిరుగుతోంది. మొన్నటి 'గుణసుందరి కథ'ని పదిసార్లైనా చూసి ఉంటాడు! 'మొదటి రాత్రి' సందర్శనం మూడుసార్లయిం దిప్పటికి! హాయిగా ఉంటాయ్ పాటలు! సినిమా పాటల తనికి కంఠస్థాలే! ఇదంతా మీరు 'సినిమా పిచ్చి' అనేటట్టయితే ఒప్పుకోడానికి సిద్ధంగా ఉన్నాడు వెంకట్రావ్!

ఇంకో పిచ్చి' ఉంది తనకి పత్రికల పిచ్చి! పత్రికలు—వార పత్రికలూ—పక్ష పత్రికలూ—మాస పత్రికలూ—యింగ్లీషువీ—తెలుగువీ—తెగకొనేవాళ్ల జాబితాలో తనే ఫస్టు వస్తాడు! అవన్నీ మొదటినుంచి చివరిదాకా చదివేదాకా తనకి నిద్ర పట్టేదికాదు।

వీటన్నిటికీ యెంత ఖర్చవుతుంది? వీటికి డబ్బెలా దొరికేది? ఇంట్లో అడిగితే—వెధవ సినిమాలకు డబ్బు తగలెయ్యడ మెందుకంటారు అపనికిరాని పుస్తకాలెందుకంటారు అంత దాకా దేనికి? గడ్డం గీయించుకోడానికి బేడా కూడాలేక పెంచుకునేవాడు! అడిగితే—'అ యేం పెరిగింది? యెప్పుడూ గొరుగుతూంటే తొందరగా వస్తుంది, నల్లపడ్తుంది' అనేవాడు!

వీటన్నిటికీ తను కనిపెట్టిన పరిష్కారమార్గం ఒకటే 'ఫ్రెండ్స్' దగ్గిర 'లోన్స్' ప్రారంభించాడు! చివరకు దాదాపు ముప్ఫయ్ రూపాయల దాకా అయింది అప్పు వాళ్లెవరూ అడిగేవాళ్లు కాదు—'ఎటికెట్'కు లోపమని। ఒకవేళ అడిగినా 'ఇస్తాలేవోయ్' 'ఉద్యోగంలో జేరానామరి జీతంరానీయ్' అనేవాడు।

ఇప్పటికి అదివచ్చింది। ఇహ ఒక్కొక్కరిదీ తీర్చాలి. స్వామికి అయిదూ, ప్రసాదుకు పదీ—రెడ్డికి రెండూ మూర్తికి మూడూ చేసేయ్యాలి మనీ ఆర్డరు! ఇంటికూడా కొంత పంపాలి!

వెంకట్రావ్‌కి నవ్వొచ్చింది గడచిన రోజుల్లోని తనస్థితికీ, యిప్పటి పరిస్థితికీ యెంత తేడా! అప్పుడందరూ తను చేతగానివాడనీ యెందుకూ పనికిరాడనీ అనేవాళ్లు ఇప్పుడు! తనూ ఒక మనిషేననీ తనకూ సంపాదించుకోటం చేతవుననీ నిరూపించాడు! అప్పుడు తనఖర్చులకి అడిగితే లేలిగ్గా లేదనేవాళ్లు వాళ్ళ బాధ్యత మరచిపోయి! ఇప్పుడు తన బాధ్యతను మరువకుండా—తనక్కావల్సినది ఉంచుకుని, ప్రతినెలా కొద్దో గొప్పో వాళ్ళకి పంపుతాడు తను! అసలుయిహ తను హాయిగా పెళ్లి చేసుకోవచ్చు—యీ అవస్థ పడకుండా! పెళ్లి చేసుకోవాలి! యీ సత్రం భోజనం మరంనిద్రా యెన్నాళ్లు! హాయిగా ఒక ఫేమిలీ పోర్షన్ తీసుకొని యిద్దరూ చిలకా గోరంకల్లా ఉండొచ్చు!

వెంకట్రావ్ ఆలోచిస్తూనే ఉన్నాడు! చేతిలో పచ్చకాగితం గాలికి రెప రెపా కొట్టుకుంటూనే ఉంది! సగర్వంగా ఆ కాగితాన్ని మడచి జేబులో పెట్టుకున్నాడు వెంకట్రావ్।

